క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్యశ్రీ శనివారం తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఫీడర్‌పై మధ్య పోల్స్ వేయడం, 11 కేవీ వైర్లపై చెట్టు కొమ్మలు నరకడం కారణంగా ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. కొండపల్లి గోపాల్‌నగర్ కాలనీ, మూడుకొట్లు, కృష్ణకాలనీ, బ్యాంక్‌కాలనీ, ఎన్జీఓస్ కాలనీ, సైనిక కాలనీ, లెనిన్‌నగర్, వడ్డెర కాలనీ ఏరియాలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

మంత్రికి వినతి

గార్ల: మండలంలోని ముల్కనూరు పంచాయతీలో పాకాల ఏటిపై మున్నేరు ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ శనివారం రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే కోరం కనకయ్యలకు మండల కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. మంత్రికి వినతిపత్రం ఇచ్చిన వారిలో పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, భూక్యా నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, మాలోత్ వెంకట్‌లాల్, సైదయ్య, తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో సుస్థిర ఆదాయం

గంగారం: పంట మార్పిడితో సుస్థిర ఆదాయం పొందవచ్చని సీనియర్ శాస్త్రవేత్త మాలతి, రాంబాబు అన్నారు. గంగారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతు ముంగింట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వేణుయాదవ్, ఏఈవోలు కిశోర్ కుమార్, సంతోష్ పాల్గొన్నారు.

వీధి లైట్ల ఏర్పాటు

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ శివారు దుబ్బతండాలో రూ.50వేల విలువగల వీధి లైట్లను గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి జాటోత్ రామారావు తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేశాడు.

వీరభద్రుడికి అన్నపూజ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వీరభద్రస్వామికి భక్తులు శనివారం అన్నపూజ కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు

నాణ్యమైన వైద్యసేవలు అందించాలి



గార్ల: వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో గ్రామాల్లో రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలని వైద్య ఆరోగ్య నోడల్ అధికారి డాక్టర్ రాజ్‌కుమార్ జాదవ్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం ముల్కనూరు పీహెచ్‌సీ లో జరిగిన ఆసుపత్రి అభివృద్ధి సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశంలో పీహెచ్‌సీ డాక్టర్ శివకుమార్, ఎంపీడీఓ మంగమ్మ, ఆర్‌ఐ శ్రీరామ్, యూడీసీ కుమార్, హెచ్‌ఈఓ శ్రీహరి, విజయలక్ష్మి, శ్రీదేవి, వెంకటేశ్వర్లు, అనిత, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: రోడ్డుకు అడ్డుగా ఉన్న కరెంట్ వైర్‌కు ప్రమాదవశాత్తు బైక్ తాకడంతో కింద పడిన ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని చెర్లపాలెం గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం పెద్దవంగర మండలంలోని చిన్నవంగర గ్రామానికి చెందిన వల్లపు అశోక్, జలగం మల్లయ్య అనే ఇద్దరు వ్యక్తులు బైక్‌పై తమ వ్యక్తిగత పనుల నిమిత్తం చెర్లపాలెం మీదిగా చీకటాయపాలెం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా తెగిపోయి రోడ్డుపై ఉన్న కరెంట్ వైర్‌కు బైక్ తాకడంతో రోడ్డుపై పడిపోయిన అశోక్, మల్లయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే 108 వాహనంలో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

వృక్షార్చనలో ఎమ్మెల్యే



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న ఎమ్మెల్యే

మరిపెడ రూరల్: భద్రాద్రి కొత్తగూడెంలో చేపట్టిన వృక్షార్చన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ హాజరయ్యారు. అక్కడ మొక్కలు నాటే ప్రాంతంలో ముందుగా ఎమ్మెల్యే పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మంత్రితో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

రైతుకు 'గుర్తింపు'

- ప్రభుత్వ పథకాల అమలులో కీలకం కానున్న 11అంకెల ఐడీ
- మండలంలో కొనసాగుతున్న నమోదు



వివరాల నమోదు చేసుకుంటున్న రైతులు

బయ్యారం: పట్టాదార్ పాసుపుస్తకం ఉన్న ప్రతి రైతుకు విశిష్ట సంఖ్య 11తో ఐడీని కేటాయించి గుర్తింపును ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో భూయజమానుల ఆధార్‌ను తమ మొబైల్ నంబర్లతో అనుసంధానిస్తూ రైతుకు ఒక ఐడీని కేటాయిస్తున్నారు. రానున్న కాలంలో వ్యవసాయరంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలనే సంకల్పం దిశగా వేసే అడుగుల్లో భాగంగానే రైతుకు గుర్తింపు నంబర్లు ఇస్తుందని తెలుస్తుంది. ఈమేరకు వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓ) అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ ఈ రిజిస్ట్రీలో రైతుల వివరాలను నమోదు చేస్తున్నారు. రానున్న కాలంలో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం వ్యవసాయ పెట్టుబడికి విడుదల చేస్తున్న పీఎం కిసాన్ సహాయంను ఈ ఐడీ ఆధారంగా చెల్లించనున్నారు.

రైతులు ఎక్కువ.. నమోదు తక్కువ

మండలంలో 29 గ్రామపంచాయతీల పరిధిలో 14వేల మంది రైతులు ఉండగా వీరికి బయ్యారం, కొత్తపేట, వెంకటాపురం, కంబాలపల్లి, రామచంద్రాపురం క్లస్టర్‌ల ఏఈఓల ద్వారా వ్యవసాయశాఖ సేవలను అందిస్తుంది. ప్రతి క్లస్టర్ పరిధిలో రైతుల నమోదు ప్రక్రియను ఈనెలలో ప్రారంభించగా మొదట రైతుల నుంచి తక్కువ స్పందన రాగా ప్రస్తుతం ఎక్కువ సంఖ్యలో రైతులు తమ వివరాల నమోదుకు ముందుకు వస్తున్నారు. దీంతో తమ వద్దకు వచ్చిన రైతులందరి వివరాలను నమోదు చేయటం ఏఈఓలకు కష్టతరంగా మారుతుంది.

నమోదు నెమ్మదిగా..

రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండటంతో మండలంలోని కొన్ని క్లస్టర్ల పరిధిలో నెట్ సరిగా రాక నమోదు ప్రక్రియ నెమ్మదిగా కొనసాగుతుంది. రైతుల వివరాలను నమోదు చేసి వారి సెల్‌ఫోన్‌కు రెండుసార్లు వచ్చే ఓటీపీని ఎంటర్ చేస్తేనే గుర్తింపు సంఖ్య వస్తుంది. కొందరు రైతులు ఆధార్ నంబర్లకు లింక్ అయిన ఫోన్ నంబర్లను ప్రస్తుతం ఉపయోగించకపోవటంతో వారి ఓటీపీ ఎవరికి వస్తుందో తెలియక ఏఈఓలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలా రైతుల వివరాల నమోదులో పలు అవాంతరాలు వస్తుండడంతో వివరాల నమోదులో ఆలస్యం అవుతుందని ఏఈఓలు పేర్కొంటున్నారు.

వివరాలు నమోదు చేస్తున్నాం..



మండలంలోని రైతుల వివరాల నమోదును ఏఈఓలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం రైతువేదికల్లో వివరాలను తీసుకొని ఓటీపీ ఆధారంగా ఆన్‌లైన్ ప్రక్రియ నిర్వహించి కోడ్ కేటాయిస్తున్నాం. తరువాత రైతువేదికల వద్దకు రాని రైతులకు అందుబాటులోకి ఏఈఓలు వెళ్లి ఫార్మర్ ఐడీని ఇస్తారు.

- ఏఓ రాంజీ, బయ్యారం

ఆడబిడ్డలకు అండగా కాంగ్రెస్ పార్టీ

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: పేదింటి ఆడబిడ్డలకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని 194 లబ్ధిదారులకు ఒక్క రోజే రికార్డు స్థాయిలో రూ.1.95 కోట్ల విలువగల చెక్కులను పంపిణీ చేశామన్నారు. బడుగుబలహీన వర్గాల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్ర రాజేశ్వరరావు, మండల అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, చిట్టెం వెంకన్న, అల్లం నాగేశ్వర్ రావు, కురెల్లి సతీష్, గొల్లపల్లి ప్రభాకర్, నాయకులు మహ్మద్ ఖలీల్, శంతన్ రామరాజు, ఎడ్ల రమేశ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గూడూరు: నియోజకవర్గానికి మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్ మండలంలో నిర్మిస్తామని ఎమ్మెల్యే మురళీనాయక్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం గూడూరుకు చెందిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మాధవపెద్ది ప్రదీప్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి శాలువా కప్పి ఎమ్మెల్యేను సన్మానించారు.

పొగాకు ఉత్పత్తుల వాడకం హానికరం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ



మాట్లాడుతున్న జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ

మహబూబాబాద్ రూరల్/నెహ్రూసెంటర్: పొగాకు ఉత్పత్తుల వాడకం ఆరోగ్యానికి హానికరమని, అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కోర్టు ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో రఫీ మాట్లాడారు. ఉత్పత్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించబోమన్ని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కృష్ణతేజ్, జిల్లా కోర్టు పరిపాలనాధికారి క్రాంతికుమార్, ఆర్టీసీ డీఎం ఎం.శివప్రసాద్, సీనియర్ న్యాయవాది దాసరి నాగేశ్వర్‌రావు, టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

దంతాలపల్లి: ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు జూనియర్ కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ధీరజ్ కుమార్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై రాజు, న్యాయవాదులు శ్రీనివాస్, ప్రవీణ్, ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి సేవిస్తున్న యువకుడి అరెస్ట్

మహబూబాబాద్ రూరల్: గంజాయి సేవిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి 294 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నామని మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ శనివారం తెలిపారు. టౌన్ ఎస్సై బి.విజయ్ కుమార్ తన సిబ్బందితో పట్టణంలోని పాత కలెక్టరేట్ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఓ ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ముగ్గురు యువకులు పోలీసులను చూసి పరారయ్యారని తెలిపారు. వారిలో ఓ యువకుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అతడి వద్ద 294 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైందన్నారు. ఇందిరా నగర్ కాలనీకి చెందిన యువకుడు సెంట్రింగ్ పనిచేసే ముదిగొండ విష్ణు గంజాయి సేవించేందుకు అలవాటుపడినట్లుగా గుర్తించి కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. పరారైన ఇద్దరు యువకులు, విష్ణుకు గంజాయి విక్రయించిన గూడూరు మండలంలోని పొనుగోడు గ్రామానికి చెందిన కుణాల్, నెక్కొండ మండలానికి చెందిన బబ్లుపై కేసు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో టౌన్ క్రైం ఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ పాపయ్య, పీసీలు రమేష్ చందర్, గౌతమ్, ఉపేందర్, నరేంద్రవర్మ, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు లేకుండా నిర్మాణాలు చేపట్టాలి

- ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు



మూడు కోట్ల సెంటర్‌లో పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు

మహబూబాబాద్: రాకపోకలకు ఇబ్బందులు లేకుండా జంక్షన్ల (సుందరీకరణ పనులు) నిర్మాణ పనులు చేపట్టాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలో రూ.75 లక్షలతో మూడు కోట్ల సెంటర్, ముత్యాలమ్మ సెంటర్, కురవి రోడ్డులో నిర్మించనున్న జంక్షన్‌ప్రదేశాలను శనివారం ఆయన పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో రోడ్ల వెడల్పు తదితర విషయాలను పరిగణలోకి తీసుకుని జంక్షన్ల అభివృద్ధి పనులు చేయాలని కోరారు. వర్షాలతో దెబ్బతిన్న చెరువులను వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోను కలిసిన ఎమ్మెల్సీ.. మానుకోట రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులపై వినతి పత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో డీఈ సీహెచ్ ఉపేందర్, మాజీ మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు జెర్రిపోతుల వెంకన్న, మార్నెని రఘు, శంకర్, ఖలీల్, గోపి, కిరణ్ పాల్గొన్నారు.

ఖుర్షీద్ సేవలు అభినందనీయం



ఖుర్షీద్ దంపతులను సత్కరిస్తున్న అదనపు కలెక్టర్, తదితరులు

చుంచుపల్లి: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహకార శాఖ అధికారిగా విధులు నిర్వర్తించిన సయ్యద్ ఖుర్షీద్ సేవలు ఎనలేనివని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఖుర్షీద్ ఉద్యోగ విరమణ సందర్భంగా భద్రాద్రి కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విధుల్లో చేరిన నాటి నుంచి సహకార రంగ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. తొలుత ఖుర్షీద్ దంపతులను అదనపు కలెక్టర్, అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, టీఎన్జీవోస్, టీజీఓస్ జిల్లా అధ్యక్షుడు రామారావు, సంగం వెంకటపుల్లయ్య, ఇన్‌చార్జ్ డీసీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలి



మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

పెద్దవంగర: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేయాలని పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని ఎంపీటీసీ పరిధి నాయకులతో చేపట్టిన ఈ సమావేశంలో ఝాన్సీరెడ్డి పాల్గొని మాట్లాడారు. పార్టీలో కష్టపడి పని చేసిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జాటోతు నెహ్రూ నాయక్, పాకనాటి రామకృష్ణారెడ్డి, తోటకూరి శ్రీనివాస్, బానోతు సీతారాం నాయక్, రంగు మురళి, సంకెపల్లి రవీందర్ రెడ్డి, మెట్టు నగేష్, ముత్తినేని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ప్రస్తుతం రోజు రోజుకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులు కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని ట్రేడ్ సెంటర్ ఆఫ్ ఇండియా (టీయూసీఐ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిల్లకంటి సూర్యం అన్నారు. సంఘం ఆధ్వర్యంలో భవన నిర్మాణ, సివిల్ సప్లయి, మున్సిపల్ కార్మికులను కలిసి కార్మికుల హక్కుల సాధన కోసం శనివారం జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికవర్గం సంఘటితమై కార్మికులపై జరుగుతున్న శ్రమ దోపిడీపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. తొర్రూరులో జరగనున్న సంఘం మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రీను, పాష, వెంకన్న, రవిబాబు పాల్గొన్నారు.

మార్కెట్ విలువతో పరిహారం ఇవ్వాలి



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

మహబూబాబాద్: సీరోలు మండలం మన్నెగూడెం గ్రామంలో ఎన్‌హెచ్ రోడ్డు నిర్మాణానికి నష్టపోతున్న రైతులకు తక్కువ నష్టపరిహారం ఇస్తున్నారని మార్కెట్ విలువను బట్టి పరిహారం ఇవ్వాలని బాధితులు వెంకటప్ప, రామనాథం డిమాండ్ చేశారు. బాధితులు శనివారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇళ్లతోపాటు వ్యవసాయ భూములు నష్టపోవాల్సి వస్తుందని మార్కెట్ విలువ ప్రకారం రూ.20లక్షలకు ఎకరం ఉంటే, పరిహారం కేవలం రూ.ఆరు లక్షలు మాత్రమే ఇవ్వడం దారుణమన్నారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి పరిహారం విషయంలో న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

ఉపాధి పనులకు వెళ్లకున్నా వేతనాలు



ఎంపీడీఓకు విన్నవిస్తున్న గ్రామస్తులు

గార్ల: ఉపాధి పనులకు వెళ్లకున్నా, వెళ్లినట్లు ఈజీఎస్ సిబ్బంది సహకారంతో దొంగ మస్టర్లు వేయించుకొని మద్దివంచ గ్రామానికి అనేక మంది వ్యక్తులు వేతనాలు పొందారు. ఇట్టి విషయంపై శనివారం మద్దివంచ గ్రామంలో విచారణకు వెళ్లిన ఎంపీడీఓ మంగమ్మను గ్రామస్తులు నిలదీశారు. ఈజీఎస్ అవినీతిపై రెండు రోజుల క్రితం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామస్తులు ధర్నా సైతం నిర్వహించారు. అవినీతికి పాల్పడిన ఈజీఎస్ సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేసి, ఉపాధి పనులకు వెళ్లకుండా వేతనాలు పొందిన వారి నుంచి ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలని గ్రామస్తులు ఎంపీడీఓకు విజ్ఞప్తి చేశారు. ఇట్టి విషయంపై ఎంపీడీఓ మంగమ్మను 'సాక్షి' వివరణ కోరగా వారం రోజుల్లో సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడిన ఈజీఎస్ సిబ్బందిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తానని తెలిపారు.

పోలీసుల అదుపులో నల్లబెల్లం వాహనం

మహబూబాబాద్ రూరల్: అక్రమంగా విక్రయించేందుకు తీసుకువచ్చిన నల్లబెల్లం వాహనాన్ని మహబూబాబాద్ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరు ప్రాంతం నుంచి మహబూబాద్ జిల్లాలోని వివిధ గ్రామాలకు నల్లబెల్లం తరలించి విక్రయించేందుకు కొందరు వ్యక్తులు తీసుకువచ్చినట్లు తెలుస్తోంది. ఒక బొలేరో వాహనంలో సుమారు 20క్వింటాళ్లకు పైగా నల్లబెల్లం బస్తాలను పోలీసులు ప్రత్యేక నిఘాపెట్టి ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

సంక్షిప్త సమాచారం

చెక్కుల పంపిణీ

గూడూరు: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం గూడూరు మండలానికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను తహసీల్దార్ నిమ్మతోట నాగభవాని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న, జిల్లా కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలు, బీరం శ్రీపాల్‌రెడ్డి, బొల్లికొండ మధుగౌడ్, చంటి స్వామి పాల్గొన్నారు.

మీసేవా కేంద్రాల తనిఖీ

నెల్లికుదురు: ప్రజల సౌకర్యం కోసం మీసేవా కేంద్రాల్లో సేవల జాబితా బోర్డులను స్పష్టంగా ఏర్పాటు చేయాలని తహసీల్దార్ సీహెచ్ నరేష్ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మీసేవా, సీఎస్‌సీ కేంద్రాలను శనివారం తహసీల్దార్ తనిఖీ చేశారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె

కురవి: ఏపీలోని నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సమీపంలో జరిగిన ప్రమాదంలో కురవికి చెందిన దుస్స రాంబాబు(40) మృతి చెందాడు. ఈమేరకు శనివారం పెద్ద కుమార్తె సమంత తండ్రికి తలకొరివి పెట్టింది.

అనారోగ్యంతో ఆశ కార్యకర్త మృతి

మరిపెడ రూరల్: ప్రజలకు సేవలందించి పలువురి మన్ననలు పొందిన మండలంలోని బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన ఆశ కార్యకర్త చింత లింగమ్మ (45) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మెడికల్ ఆఫీసర్ గుగులోతు రవి, పబ్లిక్ నర్సింగ్ ఆఫీసర్ కావేటి మంగమ్మ, సూపర్‌వైజర్, లక్ష్మికుమారి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు నివాళులర్పించారు.

నిరుపేదకు చేయూత



కురవి: మండల కేంద్రం శివారు తులిస్యాతండా జీపీ పరిధిలోని భద్రు తండాలో నిరుపేద అయిన మూడు రమేశ్‌కు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, నగదును శనివారం కురవి పీఎస్సై జీవీ కృష్ణారెడ్డి అందజేసి చేయూత నందించారు.

పశువులను రక్షించుకోవాలి

మరిపెడ రూరల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధుల నుంచి పశువులను కాపాడుకోవాలని పశువైద్యాధికారి హెచ్.మనోహర్ కృష్ణ కుమార్ రైతులకు సూచించారు. ఈసందర్భంగా మరిపెడ మండలం అబ్బాయిపాలెం గ్రామంలో పశువులకు రోగ నిరోధక టీకాల కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.

రైతులకు అవగాహన

నెల్లికుదురు: ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న జీలుగ విత్తనాలపై మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామ రైతులకు శనివారం ఐటీసీ, ఎంఎస్‌కే భద్రాచలం వారి సహకారంతో అవగాహన కల్పించారు. ఏఈఓ చందన, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

నెల్లికుదురు: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉచిత సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ రాందాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో శనివారం పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎంలకు అందించారు.

ద్విచక్రవాహనం చోరీపై ఫిర్యాదు

డోర్నకల్: ద్విచక్రవాహనం అదృశ్యంపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ ఎస్సై గడ్డం ఉమ శనివారం తెలిపారు. స్థానిక శాంతినగర్‌కు చెందిన అవుదుర్తి మనోజ్ గత ఏప్రిల్ నెల 7న తన ద్విచక్రవాహనాన్ని రైల్వే స్టేషన్ సమీపంలో నిలిపి ఉంచగా అదృశ్యమైనట్లు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సర్దుబాటు నిర్ణయాన్ని వాయిదా వేయాలి

బయ్యారం/కేసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటు చేసే విధంగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాలోత్ భద్రునాయక్ డిమాండ్ చేశాడు. శనివారం బయ్యారంలో ఆయన మాట్లాడారు.

అహల్యా బాయ్ జయంతి వేడుకలు

మహబూబాబాద్ అర్బన్: వీరవనిత రాణి అహల్యా బాయ్ జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో శనివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్లభూ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రామచంద్రరావు, మహేష్ గౌడ్, గల్లా సత్యనారాయణ, సతీష్, అశోక్ పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం శివారులో నిషేధిత జిలిటెన్ స్టిక్స్ పట్టుకున్న ఘటనలో శనివారం ముగ్గురిపై కేసు నమోదు అయినట్లు ఎస్సై మాలోతు సురేష్ తెలిపారు. పంటపొలాల్లో పేల్లుళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం మేరకు పట్టుకుని నర్సింహరావు, శ్రీను, రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కురవి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. ఈనెల 21వ తేదీన కురవి శివారులో బైక్‌ను కారు ఢీకొన్న సంఘటనలో కురవికి చెందిన కత్తి రవి(50)కి తీవ్రగాయాలతో ఖమ్మం ఆసుపత్రిలో చికిత్సపొందుతూ శనివారం మృతి చెందినట్లు పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేసినట్లు పీఎస్సై కృష్ణారెడ్డి తెలిపారు. మృతుడికి భార్య ఉమ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

నర్సింహులపేట: న్యాయం చేయాలని డిమాండ్ చేస్తు శనివారం రాత్రి మండల కేంద్రంలోని పీఎస్ ఎదుట పురుగుల మందుతాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. పిచ్చిరాంతండాకు చెందిన భూక్య వినోద, భర్త సునావత్ నరేందర్ మధ్య గొడవలతో దూరంగా ఉంటున్నారు. న్యాయం చేయాలని పీఎస్ ఎదుట శనివారం రాత్రి ఆత్మహత్యాయత్నానికి పాల్పడంతో పోలీసులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. దీనిపై ఎస్సై సురేష్‌ను వివరణ అడుగగా.. భార్యభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు.

ధాన్యం అపహరణపై ఫిర్యాదు

నర్సింహులపేట: మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరసగా రెండు రోజులు ధాన్యం అపహరణపై శనివారం బాధితుడు మందుల యాకయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గురువారం రాత్రి సుమారుగా 4క్వింటాళ్ల ధాన్యం అపహరణకు గురి అయిన సంగతి తెల్సిందే. శుక్రవారం రాత్రి మళ్లీ సుమారు 2 క్వింటాళ్ల ధాన్యం గుర్తు తెలియని వ్యక్తులు స్వాహా చేశారు. శనివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేష్ తెలిపారు.

నాణ్యమైన విత్తనాలు అందించాలి

మరిపెడ రూరల్: మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్ తదితర షాపులను టాస్క్‌ఫోర్స్, లోకల్ స్కేడ్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ వీరసింగ్ మాట్లాడుతూ.. లైసెన్స్ కలిగిన షాపులు మాత్రమే రైతులకు విత్తనాలు విక్రయించాలన్నారు. లైసెన్స్ లేకుండా అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఎస్సై సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయించే వారిని శిక్షించాలి

కేసముద్రం: నకిలీ పత్తి విత్తనాలు విక్రయించే దళారులను కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మార్తనేని పాపారావు డిమాండ్ చేశాడు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి గొడిశాల వెంకన్న, మోడెం వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.